తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
7 అక్టోబర్ 2026
పేజీలు : 08
Follow :





## ఫీర్జాదిగూడలో ఇష్టారాజ్య నిర్మాణాలు!

- అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాల జోరు?
- ముడుపుల ఆరోపణలు.. పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

బోడుప్పల్ సర్కిల్ ఫీర్జాదిగూడ పరిధిలో అనుమతులు, నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ముడుపులు అందుతున్నందువల్లే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులు తమకు తెలిసిన వారి నిర్మాణాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 'ఆ నిర్మాణం మా వారికి సంబంధించినదే' అని చెప్పగానే అధికారులు వెనక్కి తగ్గుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో 'మీకింత.. మాకింత' అన్న చందంగా వ్యవహారం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సామాన్యుడిపై ఉక్కుపాదం..
అక్రమ ఆదనపు అంతస్థుల
నిర్మాణంపై మౌనం

# ఒకే చట్టం.. రెండు న్యాయాలా?

## బోడుప్పల్‌లో మున్సిపల్ అధికారుల ద్వంద్వ వైఖరి!

### చిన్నవాడి గుడిసెకు బుల్డోజర్..పెద్దవాడి భవనానికి సలాం!

**బోడుప్పల్-అక్టోబర్ 6 (జనంసాక్షి) :**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ అధికారుల వ్యవహార శైలిపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.చట్టం అందరికీ సమానంగా అమలు కావాల్సి ఉండగా,సామాన్యులపై ఒక విధంగా, రాజకీయ పలుకుబడి ఉన్న వారిపై మరో విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రోడ్ల పక్కన జీవనోపాధి కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లు,చిన్న దుకాణాలు,కూరగాయల వ్యాపారుల నిర్మాణాలను మున్సిపల్ సిబ్బంది వేగంగా తొలగిస్తుండగా అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తులు భారీ అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, రాజకీయ నాయకులు లేదా అధికార పార్టీకి చెందిన వ్యక్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అనుమతుల కంటే ఎక్కువ అంతస్తులు నిర్మిస్తున్న భవనాలపై ఫిర్యాదులు అందినా వాటిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారని చెబుతున్నారు.అదే సమయంలో బతుకుదెరువు కోసం చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తున్న పేదలపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటున్నా రని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలుకుబడి ఉన్నవారికి ఒక న్యాయం,సామాన్యుడికి మరో న్యాయం" అనే భావన ప్రజల్లో బలపడుతోందని అంటున్నారు.

### టౌన్‌ప్లానింగ్ విభాగం ఏం చేస్తోంది?

అనుమతులు లేని నిర్మాణాలను కట్టడి చేయడంలో టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిగా విఫలమైందన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తు న్న నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయడం, పనులు నిలిపివేయ డం, అవసరమైన చోట కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు స్పందించ డం లేదని ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న అధికార-రాజకీయ సంబంధా లపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

### జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి

అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తో జీహెచ్‌ఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు అంటున్నారు. భవన నిర్మాణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు.

## అక్రమ భవనాలకు అండ..
## పేదలపై ప్రతాపం..ఇది న్యాయమేనా..?

### శంకర్ నగర్ కాలనీవాసి వెంకట్ రెడ్డి

పీర్జాదిగూడ శంకర్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ భవనంలో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టారని,దీనిపై పలుమార్లు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా,బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసి వెంకట్ రెడ్డి ఆరోపించారు."అదే భవనంలో జెప్టో కార్యకలాపాలు నిర్వహించడం వల్ల భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాల రాకపోకలు పెరిగి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.ట్రాఫిక్ సమస్యలు,శబ్ద కాలుష్యం,రాత్రి వేళల్లోనూ కార్యకలాపాలు కొనసాగడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన మాత్రం కనిపించ లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజకీయ పలుకుబడి ఉన్నవారి విషయంలో మౌనం పాటిస్తున్నారు.కానీ పూట గడవడానికి చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే పేదలు రోడ్డు పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లు, దుకాణాలను మాత్రం జేసీబీలతో కూల్చివేస్తున్నారు. బతుకుదెరువు కోసం కష్టపడుతున్న వారిని రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు."చట్టం అందరికీ ఒకటే అయితే అక్రమ భవనాలపై కూడా అదే కఠినత్వం చూపాలి.సామాన్యులకు ఒక న్యాయం, పలుకుబడి ఉన్నవారికి మరో న్యాయం ఉండకూడదు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేసి అందరికీ సమాన న్యాయం చేయాలని వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.



# దేవుడి భూమిపై దళారుల దందా!

### ఎండోమెంట్ భూమికి పట్టా కోసం ముఖ్యమంత్రి స్థాయిలో పైరవీలు?

- అగ్గనూరులో 18.7 ఎకరాల భూమిపై ఆరోపణలు
- నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలంటూ ప్రచారం
- రూ.35 లక్షల అడ్వాన్స్ ఇచ్చి భూమి దక్కలేదంటున్న రిటైర్డ్ ఎస్సై
- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుడి విజ్ఞప్తి

10

## శేరిలింగంపల్లిలో అక్రమ వ్యభిచారానికి నయా భాష్యం

- ప్రైవేట్ లాడ్జిలే అసాంఘిక అడ్డాలుగా మారుతున్న వైనం!
- మైనర్ అమ్మాయిలే లక్ష్యంగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హోటల్స్
- సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సాక్షిగా కొరవడుతున్న నిఘా వైఫల్యం!?

లోపలి పేజీలో

## పేదల సంక్షేమమే లక్ష్యం..అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

### సర్పంచ్ మారేపల్లి భాగ్యలక్ష్మిపాపారావు



శంకర్ పల్లి,అక్టోబర్ 6 (జనం సాక్షి)మండల పరిధిలో గల ఎల్వర్తి గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో నూతన రేషన్ కార్డుల పంపిణీ సర్పంచ్ మారేపల్లి భాగ్యలక్ష్మి పాపారావు, జిపిఓ మహాలక్ష్మి తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారేపల్లి భాగ్యలక్ష్మి పాపారావు మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని అన్నారు.నూతన రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ తోపాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందుతాయి అన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులందరం సమన్వయంతో చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాంతిరెడ్డి, వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, నాగరాజు, నారాయణరెడ్డి, జన్వాడ శ్రీలత, బిక్షపతి, ఉరడి వరమ్మ, కళ్యాణం శ్రీనివాస్, మారేపల్లి యాదయ్య, ఎలిమెల అమృత, నక్క స్వప్న, నవీన్ కుమార్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణ



బొంరాస్ పేట, అక్టోబర్ 6 (జనంసాక్షి): మండల కేంద్రంలో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు.దివ్యాంగ విద్యార్థులలో శారీరక,మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విధంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు గంగాధర్ రావు, మహేందర్, ఐఆర్పి వేణుగోపాల్, ఎంఆర్సి సిబ్బంది, ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలి

### హైదరాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా



హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 06 (జనం సాక్షి) : జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ప్రియాంక అలా సూచించారు. హైదరాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజ యం సాధించిన నూతన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు,కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలాను మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్ ఏ.వి.రావు, వైస్ చైర్మన్ వి.మణిదీప్‌తో పాటు 15 మంది మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, భీమిరెడ్డి ప్యానల్ సభ్యులు కలెక్టర్‌ను కలిశారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపా రు. రెడ్‌క్రాస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేసి, అవసరమైన వారికి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆమె సూచించారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించే నేరస్థులపై నిఘా

### జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా



వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 6 (జనం సాక్షి):శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణ లక్ష్యంగా మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెల్లవారుజామున 5 గంటలకు ప్రారంభించి ఉదయం 8:30 గంటల వరకు సుమారు ఐదు గంటల పాటు విస్తృతంగా నిర్వహించారు. జిల్లా స్నేహ మెహ్రా స్వయంగా పాల్గొని కాలనీ వాసులతో మాట్లాడటం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతాయుతంగా, శాంతియుతంగా మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడే వారు, రౌడీషీటర్లు ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు లేదా అసాంఘిక చర్యలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు నేరాలకు సంబంధం ఉన్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సారి అయిన పత్రాలు లేని మొత్తం 50 ద్విచక్ర వాహనాలు మరియు 01 ఆటోను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో 35 క్వార్టర్ మద్యం సీసాలు, 09 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉండే కల్తీ ఆహార పదార్థాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి గుట్కా, మీరాజ్, కల్తీ ఆయిల్, రసగుల్లాలు, కల్తీ పాపడ్లు, కల్తీ చకోడీలు తదితర ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు చర్యలు చేపట్టారు.కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా స్నేహ మెహ్రా, హెచ్చరించారు. కాలనీలలో నేరాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, మోమిన్‌పేట్ సీఐ శ్రీ వెంకట్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు సిబ్బంది, డీఏఆర్ సిబ్బంది, క్యూ.ఆర్.టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 85 మంది పోలీస్ అధికారులు సిబ్బంది ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

## పులుమామిడి గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు



నవాబుపేట్ అక్టోబర్ 6 (జనం సాక్షి )నవాబుపేట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో గత మూడు రోజుల నుండిత్రాగడానికి నీళ్లు లేక తల్లడిల్లుతున్న గ్రామ ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు గత రెండు రోజుల నుండి పూర్తిగా రావడం లేదు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా మంగళవారం గ్రామ ప్రజలు పులుమామిడి గ్రామంలో గత 20 సంవత్సరాల క్రితం నీళ్లు లేక తీవ్ర గ్రామ ప్రజలు పొలాల నుండి బోరు బావుల నుండి నీళు తెచ్చుకునేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గత పది సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గ్రామాల్లోకి మిషన్ భగీరథి నీళ్లు రావడంతో గ్రామం ప్రజలు ఎంతో ఆనందంతో నిండిపోయినారు గత పది సంవత్సరాల నుండి నీళ్లకు ఇబ్బందులు లేకుండా ప్రజలు హాయిగా సుఖసంతోషాలతో ఉండేవారు. గత మూడు రోజుల నుండి మిషన్ భగీరథ నీళు రాక, గ్రామంలో ఉన్న బోరు బావుల నుండి నీళ్లు లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్న సందర్భంగా గ్రామ సర్పంచి దాన నర్సింలు ఆధ్వర్యంలో బోరు బావుల నుండి నీటిని గ్రామంలోని ట్యాంకర్లకు సరఫరా చేస్తున్నారు. ప్రజలు తినడానికి తిండి లేక ఇబ్బంది పడుతున్న సరే కానీ త్రాగడానికి నీళ్లు లేకుండా ఎట్లా ఉంటాము మా గ్రామానికి నీళ్లను సరఫరా చేయాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని గత రెండు రోజుల్లో నూతనంగా బోరును వేస్తానని సర్పంచి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చినారు. గ్రామం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఎంతవరకైనా త్యాగం చేసి గ్రామం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి తొందరగా మంచినీటి సరఫరాను అందించే విధంగా ప్రయత్నం చేస్తానని సర్పంచ్ దాన నరసింహులు తెలిపారు.

# ప్రొఫెషనల్స్‌ను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలి

### దేశవ్యాప్తంగా ఏఐపీసీని బలోపేతం చేస్తాం మధుయాష్కీ గౌడ్



హయత్ నగర్ అక్టోబర్ 6 (జనం సాక్షి)ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐపీసీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత విస్తరణ, దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌ను ఏకం చేయడం, పాలసీ రూపకల్పనలో నిపుణుల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ప్రొఫెషనల్స్‌ను రాజకీయాలు, పాలసీ రూపకల్పన, ప్రజా సమస్యలు, దేశ నిర్మాణంతో అనుసంధానం చేయడమే ఏఐపీసీ లక్ష్యమని మధుయాష్కీ గౌడ్ తెలిపారు. ఆరు నెలల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సంస్థను బలోపేతం చేయడంతో పాటు జిల్లా, నియోజకవర్గం, నగర, స్థానిక స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, ఐటీ నిపుణులు, కళాకారులు, క్రీడాకారులు, జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, స్కిల్డ్, గిగ్ వర్కర్లను ఏఐపీసీలో భాగస్వాములను చేస్తామని తెలిపారు. ప్రొఫెషనల్స్ నైపుణ్యం, అనుభవాన్ని దేశ విధాన రూపకల్పనకు వినియోగించేలా ప్రత్యేక నిపుణుల కమిటీలు, పాలసీ రీసెర్చ్ గ్రూపులు, అడ్వైజరీ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉద్యోగాలు, గృహ నిర్మాణం, జీవన వ్యయం, పన్నుల భారం, ఉద్యోగ భద్రత వంటి సమస్యలపై డేటా ఆధారిత అధ్యయనాలు నిర్వహించి ప్రత్యామ్నాయ విధానాలను రూపొందిస్తామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో 'ప్రొఫెషనల్స్ డైలాగ్' కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఏఐపీసీ ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫెలోస్ ప్రోగ్రామ్ రెండో బ్యాచ్‌ను 100 మంది ప్రొఫెషనల్స్‌తో విస్తరించినట్లు వెల్లడించారు. ఏడాది పాటు రాష్ట్రాల పర్యటనలు, ప్రొఫెషనల్స్ సమావేశాలు, పాలసీ డైలాగ్స్ నిర్వహించి, అనంతరం జాతీయ స్థాయిలో 'ఏఐపీసీ నేషనల్ ప్రొఫెషనల్స్ కన్వెన్షన్' నిర్వహించనున్నట్లు చెప్పారు."ప్రొఫెషనల్స్--పాలిటిక్స్--పాలసీ--నేషన్ బిల్డింగ్ మధ్య వారధిగా ఏఐపీసీని తీర్చిదిద్దడమే లక్ష్యం. నిపుణుల ప్రతిభను ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, ప్రజా సంక్షేమం, దేశ నిర్మాణం కోసం వినియోగిస్తాం" అని మధుయాష్కీ గౌడ్ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం పెద్దపీట వేయాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 6( జనం సాక్షి)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం125 -గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సమీపంలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సముదాయాల శంకుస్థాపన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక శాసన సభ్యులు, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ఇందిరమ్మ ఇళ్ల సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరిట తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఇళ్ల సముదాయాలలోని లబ్ధిదారులకు ఇండ్లు కట్టించి ఇవ్వడమే కాదు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రార్థన మందిరాలకు, వైకుంఠ ధామాల కోసం స్థలాలను కేటాయించి అభివృద్ధిపరిచేలా హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్, స్థానిక మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి పరచాలని. ఎమ్మెల్యే కే వివేకానంద తెలిపారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించడమే లక్ష్యం కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి)**సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా హైకోర్ట్ కాలనీ డివిజన్‌లో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సలహాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను వారు పరిశీలించారు. ప్రజల ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది అని, పేదలు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి, ముఖ్యంగా ఆరోగ్య భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ముందుండాలని ఆయన అన్నారు. "సేవే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం" అనే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, సాహెబ్‌నగర్ డివిజన్ అధ్యక్షులు ప్రేమ్‌నాథ్, సీనియర్ నాయకులు ప్రభాకర్, గోవిందాచారి, యాదగిరి, మహిళా నాయకురాలు పార్వతి, నాయకులు వెంకన్న, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అభిలాష్, రితిక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష నిరసన ధర్నా
- తరలి వచ్చిన కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ శ్రేణులు
- నినాదాలతో దద్దరిల్లిన జిల్లా కలెక్టరేట్
- అదనపు కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేత



**రంగారెడ్డి, అక్టోబర్ 6 (జనంసాక్షి):**ఎస్ఐఆర్ పేరుతో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న ఏకపక్ష వైఖరి సరికాదని ఆయనను తొలగించాల్సిందేనని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ డా. కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలన్నారు. ఫారం-6, ఫారం-7కు సంబంధించిన వివాదాస్పద నిబంధనలను పునఃపరిశీలించాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఇండియా కూటమి పక్షాన ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని, ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల డేటా కేంద్రీకరణను నిలిపివేసి, స్థానిక ఎన్నికల అధికారులకు ఓటర్ల జాబితాల నిర్వహణపై పూర్తి బాధ్యత కల్పించాలని కోరారు. ఎన్నికల డేటాపై తటస్థ ఐటీ నిపుణులతో స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకత కోసం ప్రధాని, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఎంపిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న జెంజీ ధర్నాకు సంపూర్ణ మద్దతు పట్టించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బోడ సామేలు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జీ భీమ్ భరత్, శేరిలింగంపల్లి ఇంచార్జీ జగదీశ్వర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, కాంగ్రెస్ ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలు పాల్గొన్నారు.

# ఎంసీహెచ్‌లో మందుల కొరత

### వైద్యులు అందుబాటులో లేకే ఆరేళ్ల చిన్నారి శ్రీ ఆద్య మృతి
### బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్



**తాండూరు అక్టోబర్ 6(జనంసాక్షి)**రుక్మాపూర్ గ్రామానికి చెందిన నరేష్, సంగీత దంపతుల ఆరేళ్ల చిన్నారి శ్రీ ఆద్య మృతి బాధాకరమని, ఎంసీహెచ్‌లో మందుల కొరత, తాండూరులో వైద్యులు అందుబాటులో లేకపోవడం కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో తాండూర్ బీసీ సంఘం ఆధ్వర్యంలో రుక్మాపూర్ గ్రామానికి వెళ్లి శ్రీ ఆద్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా నిలిచారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు శ్రవణ్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షకూర్,మహిళా అధ్యక్షురాలు శివలీల, యాలాల మండల అధ్యక్షుడు లక్ష్మణచారి, బీసీ నాయకులు మల్లేష్, అశోక్, టేలర్ రమేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బృందావన్ కాలనీలో పౌర సమస్యలపై డీసీ పరిశీలన



**రాజేంద్రనగర్,అక్టోబర్6(జనంసాక్షి)** "వన్ డే--వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి కోకాపేట వార్డు నం.125లోని బృందావన్ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు, వీధి కుక్కల సమస్యలను పరిశీలించారు.రోడ్లను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, పారపేట వాల్స్, ఇతర కట్టడాలను తొలగించాలని, అవసరమైన ప్రాంతాల్లో సింగిల్ ఆర్మ్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు తెలిపిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డీఈ కార్తీక్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ అన్వేష్ రెడ్డి, వార్డు అధికారి సుప్రు, బిల్ కలెక్టర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ లీకేజీ

### వృథాగా పోతున్న తాగునీరు
### పట్టించుకోని అధికారులు



**షాబాద్,అక్టోబర్ 6(జనం సాక్షి);** షాబాద్ మండల కేంద్రంలోని గోల్డ్ పేస్ కాలనీ ప్రధాన రహదారి (షాద్నగర్ రోడ్డు వైపు గల, హోటల్ సాయి కృష్ణ) దగ్గరలో గల మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ నుంచి లీకైన నీరు రోడ్డుపక్కన నిలిచి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాల్సి ఉండగా, పైప్‌లైన్ లీకేజీ కారణంగా విలువైన నీరు వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని అరికట్టి, రోడ్డుపక్కన నిలిచిన నీటిని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# చెన్నాపురంలో ఘనంగా వడ్డెర ఓబన్న వర్ధంతి వేడుకలు

### ఓబన్న పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి



**జవహర్‌నగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని చెన్నాపురంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మహనీయుడు వడ్డెర ఓబన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ వడ్డెర ఓబన్న ధైర్యసాహసాలు, దేశభక్తి, పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. సమాజ అభివృద్ధి కోసం మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ పాల్గొని ఓబన్న సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వెంకటేష్, డీఎస్ఎస్ వెంకటేష్, గజ్వేల్ శంకర్, వీర్ల భుజంగం, విజయరాయ్, మల్లేశం, రాము, రాజు యాదవ్, బిట్టు తదితరులతో పాటు వడ్డెర కుల సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్



**మర్పల్లి అక్టోబర్ 06 (జనంసాక్షి)** మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 6 మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామ చౌరస్తా దగ్గర ఒక షెటర్లో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా ఉదయం ఐదు గంటల సమయంలో వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి 18వేల రూపాయలు, 208 కార్డులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

## పెద్దమ్మగుడిలో నీటి సమస్య పరిష్కరించాలని వినతి



**రాజేంద్రనగర్,అక్టోబర్6(జనంసాక్షి)**హైదర్‌షాకోట్ 123 డివిజన్ పరిధిలోని పెద్దమ్మగుడి రోడ్ నంబర్ 3లో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరారు. మాజీ కార్పొరేటర్ తలారి పద్మావతి పాండు ఆధ్వర్యంలో వాటర్‌బోర్డు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. క్రమం తప్పకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## బీజేపీ మహిళా నేతకు బెదిరింపులు అల్వాల్‌లో కేసు

**అల్వాల్, అక్టోబర్ 6(జనంసాక్షి):**మహిళా బీజేపీ నాయకురాలిని వేధించడం, కులపరంగా దూషించడం, బెదిరింపులకు పాల్పడ్డారన్న ఫిర్యాదుతో మాజీ బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయి ప్రసాద్ అలియాస్ 'టీమ్ సాయి'తో పాటు మరికొందరిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త, పిల్లలకు హాని చేస్తామని బెదిరించడంతో పాటు అసభ్యకర పదజాలంతో దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నకిలీ, ఏఐ రూపొందించిన ఫొటోలు, వీడియోలు సృష్టించి ప్రచారం చేస్తామని బెదిరించినట్లు ఆమె ఆరోపించారు. ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 989/2026 కింద బీఎన్ఎస్, ఐటీ చట్టం, ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

### ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్.శ్రీధర్



**బొంరాస్ పేట, అక్టోబర్ 6 ( జనం సాక్షి):** మండల పరిధిలోని తుంకిమెట్ల సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్ .శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కళాశాలలో మౌలిక వసతులతో పాటు విద్యుత్ సౌకర్యం ఇతర పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీర్లకు సూచించారు.కళాశాల ఆవరణంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట ఎంపీడీవో దయానంద్,ఎంపీవో రవి నాయక్,పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

### సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే తొలగించాలి
### ప్రగతిశీల మహిళా సంఘం




**హయత్ నగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి)**ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూయ, ప్రధాన కార్యదర్శి అందే మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆరోపించారు. ఓటర్లుగా తమ హక్కును నిరూపించుకోవడానికి ఆధార్ సహా పలు గుర్తింపు పత్రాల విషయంలో నిబంధనలు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వివాహం తర్వాత పేర్లు, ఇంటిపేర్లు మారే మహిళలు పత్రాల పరంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.దేశ పౌరులందరికీ ప్రజాస్వామిక ప్రక్రియలో పాల్గొనే హక్కు ఉందని, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన పౌరుల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, దీనిని రద్దు చేయాలని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో గవర్నర్' కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం పాల్గొంటుందని తెలిపారు.

# విద్యా ప్రాంగణంలో అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలి

### అధికారులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశాలు



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** చంచల్‌గూడ విద్యా ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి, మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు, డీపీఆర్‌లను సత్వరమే సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సంబంధిత ఇంజనీరింగ్ అధికా రులను ఆదేశించారు.మంగళవారం మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చాంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి కలెక్టర్ పరిశీ లించారు.ఈ సందర్భంగా ప్రాంగణంలో కొనసాగు తున్న ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని మౌలిక వసతులు, సౌకర్యాలను ఆమె పరిశీలించారు. విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో పాటు రోడ్లు భవనాల శాఖ, తెలంగాణ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఇంజ నీర్లతో కలిసి అవసరమైన మరమ్మతులు, పునరు ద్ధరణ పనులపై సమీక్షించారు. ప్రాంగణంలో గుర్తించిన అవసరాలను అంచనా వేసి, చేపట్టా ల్సిన పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాద నలు, డీపీఆర్‌లను వీలైనంత త్వరగా సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడు తూ చాంచల్‌గూడ విద్యా ప్రాంగణంలో పాఠశాల, కళాశాలలు, క్రీడా సౌకర్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించినట్లు తెలి పారు. పాఠశాల భవనాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో మూడు అంతస్తులతో నిర్మించనున్నట్లు చెప్పారు. ఒక్కో అంతస్తు 13 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని వివరించారు. అలాగే పోస్ట్‌గ్రాడ్యుయేట్ కళాశాల భవనాన్ని గ్రౌండ్, మొదటి అంతస్తులతో, ఒక్కో అంతస్తు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రెండో అంతస్తు నిర్మా ణం చేపట్టనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పాఠ శాల, కళాశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, మౌలిక వసతుల కల్పనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామకృష్ణ, సైదాబాద్ తహసీల్దార్ మణిపాల్ రెడ్డి, చార్మినార్ తహసీల్దార్ నిహారిక, జిల్లా యువజన, క్రీడల అధికారి నంద కిషోర్ గోకుల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లో గుప్త నిధుల వేట.. ఆరుగురు పట్టివేత



**యాలాల అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :** యాలాల మండలంలో అర్ధరాత్రి వేళ గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్న ఘటన కలకలం రేపింది. మండలంలోని బండమీదిపల్లి గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో యాలాల పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరో ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది.తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీతో పాటు రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. అర్ధరాత్రి సమయంలో యంత్రాలతో తవ్వకాలు నిర్వహించడంపై పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ తవ్వకాల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఇందులో మరెవరైనా ఉన్నారా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయనే అనుమానాల నేపథ్యంలో ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు, అక్కడి పరిస్థితులు మరియు స్వాధీనం చేసుకున్న వాహనాల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు.

## తల్లి పిల్లల ఆరోగ్య రక్షణే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

### : అలియాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి



**అలియాబాద్ అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :**అలియాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యం లో మంగళవారం రోజు పీఎం మోడీ ఇచ్చిన పిలుపుమేరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు సరైన పోషక పదార్థాలు అందుతున్నాయా లేదా గర్భిణీ స్త్రీలకు పలు రకాల వాళ్లకి గుడ్లు పోషక పదార్థాలను సరైన సమయంలో పంపిణీ చేస్తున్నారా అని అంగన్వాడి కేంద్రాలను సందర్శించి అంగన్వాడి కేంద్రాలలో ఉన్నటువంటి పిల్లలకు అలియాబాద్ మున్సిపాలిటీ తరఫున వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, మండల అధ్యక్షులు కౌన్సిలర్ దీపికా రెడ్డి, ఖైర గనేష్ లు కలిసి అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి పిల్లలకి పలకలు, బిస్కెట్ ప్యాకెట్లు పండ్లు పంచారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్నటువంటి అంగన్వాడి టీచర్లను శాలువాతో సన్మానించి వారు పిల్లలకు చేస్తున్న సేవ చాలా గొప్పది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అలియాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు కొరివి కృష్ణ ముదిరాజ్, వైస్ చైర్మన్ మాలతి మాధవ రెడ్డి, రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ ఖైరా గణేష్, దీపికా రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నిరుదు అశోక్, మండల ఎస్టి మోర్చా అధ్యక్షులు భీమా నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ కోరుపల్లి యాదగిరి, బూత్ అధ్యక్షులు పాక నాగరాజు లు పాల్గొన్నారు.

# నవరాత్రులు ప్రశాంతంగా ముగియడంలో జర్నలిస్టుల సహకారం అభినందనీయం

### డీసీపీ నారాయణ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06(జనం సాక్షి )** ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగియడంలో పోలీసులతో పాటు స్థానిక జర్నలిస్టులు అందించిన సహకారం అభినందనీయమని డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. పండుగల సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పోలీసులకు సహకరిస్తూ వార్తల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. బోనాలు, నవరాత్రుల సందర్భంగా భారీగా ప్రజలు తరలివచ్చినప్పటికీ పోలీసుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు డీసీపీ పేర్కొన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా జర్నలిస్టులు వ్యవహరించడం వల్ల భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయగలిగామని తెలిపారు. 112 అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నేరాల నియంత్రణకు మరింత బలం చేకూరిందని డీసీపీ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 112కు సమాచారం అందించాలని, సమస్యలను ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారా అనేక ఘటనలను నివారించే అవకాశం ఉంటుందని సూచించారు. మరోవైపు, వాహనదారులు రహదారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీపీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే, కాలనీల్లో, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు మరింత సహకరించవచ్చని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీసులు ,ప్రజలు,జర్నలిస్టులు సమన్వయంతో పనిచేస్తే ఇబ్రహీంపట్నం డివిజన్‌ను మరింత సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కెవిపి రాజు, ఫ్యూచర్ సిటీ సిఐ మహేందర్ రెడ్డితో పాటు మంచాల, యాచారం, మాడ్గుల సిఐలు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం

### మాజీ ఎంపీపీ, ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్త



**యాలాల, అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ సాధించేలా కృషి చేయాలని యాలాల మండల మాజీ ఎంపీపీ, ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్త పిలుపునిచ్చారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే మంచి మెజార్టీ సాధించడం సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ మధు జన్మదిన వేడుకలను మాజీ ఎంపీపీ, ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్త ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు ఆకుల శివకుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మధుకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ గుప్త మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు బీజేపీ కి కీలకమైనవని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఓటర్లను కలుస్తూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోకట్ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, అక్కంపల్లి మాజీ సర్పంచ్ రమేష్‌గౌడ్, సర్పంచ్ వెంకటేశం, అనిల్ ,మ్మజీ సర్పంచ్ భాజరప్ప, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ కిషన్, రాములు నాయక్, మోత్కూరు సాయి, అరుణ్, మండల ప్రధాన కార్యదర్శులు రమేష్, కాశీనాథ్‌తో పాటు పలువురు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టాలి

### మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలి

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు అక్టోబర్ 6(జనంసాక్షి)**పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 26, 27, 33, 34, 35, 36 వార్డుల్లో నిర్వహించిన స్వచ్ తాండూరు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పర్యటించి మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణ, రోడ్లు, వీధుల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టాలని, మురుగు కాలువల శుభ్రతతో పాటు రోడ్లు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయా వార్డుల్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే, అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం



చేసి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే స్థానిక ప్రజలను నేరుగా కలిసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు నిరంతరం ఫాగింగ్ నిర్వహించాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వార్డుల్లోని అంగన్వాడీ కేంద్రాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించి, అక్కడి పరిస్థితులను, పిల్లలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ తాండూరు స్పెషల్ డ్రైవ్"లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు కేవలం ప్రత్యేక కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయం తో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛమైన తాండూరు నిర్మాణంలో మున్సిపాలిటీకి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కమిషనర్ రాకేష్, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సీనియర్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



**శామీర్ పేట, అక్టోబర్ 6 (జనం సాక్షి )**శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్న దానం చేపట్టగా శామీర్ పేట కు చెందిన గడియారం మురళీధర్ శర్మ వారి కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం, కూరగాయలు, అలాగే అలియాబాద్ కు చెందిన గుత్తికొండ సాయి కృష్ణ 25 కేజీల బియ్యం, కేశవరంకు చెందిన కంచిగట్ల పోషయ్య (జగన్) 25 కేజీల బియ్యం, శామీర్ పేట కు చెందిన బండి బాలరాజ్ గౌడ్- మహేశ్వరి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# అనాథ పిల్లలకు పండ్ల పంపిణీ



**హయత్ నగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి)**కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెట్టు రవీందర్ గౌడ్ 50వ పుట్టినరోజు సందర్భంగా లాలన ఫౌండేషన్‌లోని అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ, పిల్లలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచేలా పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, శ్రీహరి, అరుణ్ కుమార్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఏటీఎం చోరీ



**శంషాబాద్,అక్టోబర్6(జనంసాక్షి)**శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని శాతంరాయిలో ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి రూ.30 లక్షలకు పైగా నగదు అపహరించినట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిన్నజీయర్ స్వామీజీని కలిసిన మంత్రి తుమ్మల



**శంషాబాద్,అక్టోబర్6(జనంసాక్షి)**ఖమ్మంలో ఈ నెల 12న నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్ర శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామీజీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. శంకుస్థాపన కార్యక్రమం చిన్నజీయర్ స్వామీజీ అమృతహస్తాల మీదుగా జరుగుతుందని తెలిపారు.

# వివాహిత అదృశ్యం

## బంధువుపై భర్త అనుమానం



**చేవెళ్ల, అక్టోబర్ 06 (జనంసాక్షి)** చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కొలగళ్ల సుధాకర్ (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ ఉదయం పనికి వెళ్లిన సుధాకర్, రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య శిరీష (22) ఇంట్లో కనిపించలేదు. బంధువులు, పరిసర గ్రామాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కాగా, ఈర్లపల్లి ఉప సర్పంచ్ దయాకర్‌కు శిరీష ఫోన్ చేసి భర్తతో కాపురం చేయబోనని చెప్పినట్లు సమాచారం అందింది. తన మేనత్త కుమారుడైన గణేష్‌పై అనుమానం ఉందని సుధాకర్ చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరోగ్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్

- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి
- ఎన్‌సీడీ సర్వే, స్క్రీనింగ్ ప్రతిరోజూ చేయాలి





**హైదరాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని ఆర్ఎఫ్‌పీటీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డా.పుట్ల శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. హాజరు రిజిస్టర్, వైద్య సేవలు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ, రికార్డులు, పరిశుభ్రతను పరిశీలించారు. ఎన్‌సీడీ సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్‌ను ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. అర్హులైన బాలికలను గుర్తించి హెచ్‌పీవీ టీకాలు త్వరితగతిన ఇప్పించాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గర్భిణుల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వేలు సమర్థంగా నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.సాయిబాబా, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు అండగా బీఆర్ఆర్ ఫౌండేషన్

## బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మొలుగు సంజీవ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామం సూర్యోదయ కాలనీకి గ్రామ పంచాయతీ సిబ్బంది మంకాల పోచమ్మ ఇటీవలే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి వెంటనే తన వంతు సహాయంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మొలుగు సంజీవ ను అక్కడకు పంపించి ఆమె దశదిన కర్మ కార్యక్రమానికి 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా సంజీవ మాట్లాడుతూ.. పేద ప్రజలకు నిరంతరం బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి అండగా ఉంటారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో మొలుగు జగన్, దోర్నాల లింగం, గువ్వల సురేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పోషణతోనే ఆరోగ్యకర సమాజం : సీడీపీఓ వినీతాదేవి

## 'మన అంగన్వాడీ.. మన బాధ్యత'పై అవగాహన

## పోషకాహార ప్రదర్శన, వెల్ బేబీ షో, అన్నప్రాసన కార్యక్రమాలు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మండలంలో పోషణ మాసం--2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' అనే థీమ్‌తో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ప్రజల భాగస్వామ్యంతో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ వినితాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ బాధ్యత, పోషణ వైవిధ్యం, పూర్వ ప్రాథమిక విద్య, 'మన అంగన్వాడీ.. మన బాధ్యత', పీఎంఎన్‌వై తదితర అంశాలపై వివరించారు. తల్లులు, పిల్లల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, ప్రవర్తనా మార్పుల్లో సమాజం భాగస్వామ్యం కీలకమని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణతో పాటు పిల్లలకు సకాలంలో టీకాలు వేయించడం ప్రాధాన్యతను వివరించారు. ఏపీఎం సాంబశివరావు మహిళల భాగస్వామ్యం, పోషకాహారంపై వారి బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులకు వెల్ బేబీ షో, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పుదినుసులతో తయారు చేసిన పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్వాడీ టీచర్లకు పోషకాహారంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మణెమ్మ, కల్పన, తులసి, సరళ, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతును అణచివేయడమే ప్రజాస్వామ్యానికి ప్రమాదం

## ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలకు సమాధానం చెప్పాలి : మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ, తమ అభ్యంతరాలను ఎన్నికల సంఘం ముందుంచేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ పాశవిక చర్యలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందన్న ప్రతిపక్షాల ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ నేపథ్యంలో ఆందోళనలను అణచివేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని మంత్రి అన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదని, ప్రశ్నించే గొంతును అణచివేయడమే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రమాదమని అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రజల ప్రశ్నలను అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటే అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఆ ఓటు హక్కుపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా ఎన్నికల వ్యవస్థ స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేయాలని వాకిటి శ్రీహరి అన్నారు. దేశంలో జరుగుతున్న నియంతృత్వ, అప్రజాస్వామిక విధానాలను మేధావులు, విద్యావంతులు, బుద్ధిజీవులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.



## చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు అందించాలి : కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్టలోని అంగన్వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధి, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేయడమే బీజేపీ నాయకుల లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, నాయకులు పార్వతి, గోవిందాచారి, జంజ్య నాయక్, మొగులయ్య, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అభిలాష్, రీతిక్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టకాలంలో సుమలత కుటుంబానికి చేయూత

### వికలాంగుల కాలనీలో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ



**జవహర్‌నగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ చంద్రపురి డివిజన్ పరిధిలోని వికలాంగుల కాలనీలో నిరుపేద కుటుంబానికి మంగళవారం నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్న సుమలత కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచారు. సుమలత భర్త రాజు దివ్యాంగుడు కాగా, అనారోగ్యంతో గతేడాది మృతి చెందారు. దీంతో ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్న సుమలతకు గత రెండు నెలలుగా కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పరిస్థితి దయనీయంగా మారిన విషయాన్ని వికలాంగుల రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మెరుగు శివకృష్ణ, జవహర్‌నగర్ మణికంఠ పూసల సంఘం అధ్యక్షులు మధ్యబోయిన రాజును సంప్రదించారు. స్పందించిన ఆయన సుమలత కుటుంబానికి వారానికి సరిపడా నిత్యావసర సరుకులతో పాటు బియ్యం బస్తాను అందించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం వికలాంగుల కాలనీలోని సుమలత నివాసానికి వెళ్లి నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న సుమలత కుటుంబానికి సమాచారం అందిన వెంటనే స్పందించి అండగా నిలిచిన మణికంఠ పూసల సంఘం అధ్యక్షులు మధ్యబోయిన రాజుకు, వారి కుటుంబ సభ్యులకు వికలాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకుడు నాగరాజు, మహిళా నాయకురాలు సుగుణక్క తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ మల్లికార్జున్‌కు ఘన సత్కారం

**హైదరాబాద్, అక్టోబర్ 6( జనం సాక్షి) :** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ) తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా (మాస్ కమ్యూనికేషన్స్) ఇటీవల నియమితులైన ఎన్. మల్లికార్జున్‌ను తెలంగాణ రాష్ట్ర శాలివాహన (కుమ్మరి) సంఘం అధ్యక్షులు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్. మల్లికార్జున్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ హక్కుల పరిరక్షణకు, బాధితులకు న్యాయం అందించడానికి ఆయన నేతృత్వంలో ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని ఆకాంక్షించారు. సత్కారాన్ని స్వీకరించిన అనంతరం ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ రాష్ట్ర చైర్మన్ ఎన్. మల్లికార్జున్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కమిషన్ జాతీయ నాయకత్వానికి, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధనే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీబీ గ్రూప్ ఎండీ మల్లికార్జున్ రెడ్డి, శాలివాహన సంఘం జూబ్లీహిల్స్ అధ్యక్షులు రాములు, రాష్ట్ర నాయకులు నరసింహరావు, నగేష్, ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల ఫిర్యాదుపై అల్వాల్ సాయిపై కేసు

**అల్వాల్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** బీజేపీ మహిళా జాతీయ నాయకురాలి ఫిర్యాదు మేరకు మాజీ బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయి ప్రసాద్‌పై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగిక వేధింపులు, బెదిరింపులు, కులపరమైన దూషణలకు పాల్పడ్డారంటూ ఆమె ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బీఎన్ఎస్ సెక్షన్లు 75, 78, 79, 351(3), 352, ఐటీ యాక్ట్‌లోని 66జ, 66జు సెక్షన్లతోపాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని 3(1)(r), 3(1)(s), 3(1)(w)(i), 3(1)(w)(ii) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## హస్తినాపురంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం

### ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న నర్సింగ్ కళాశాల బస్సు



**ఎల్బీనగర్ అక్టోబర్ 6 (జనంసాక్షి) :** హస్తినాపురం హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాలకు చెందిన బస్సు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనడంతో అది పేలిపోయింది. బస్సులో విద్యార్థులు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఆయిల్ మొత్తం రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే హస్తినాపురం కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి స్పందించి విద్యుత్ శాఖ ఏఈ పర్వతాలకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. రోడ్డుపై ఉన్న ఆయిల్ కారణంగా వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో మట్టి పోయించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం బస్సులను అత్యంత జాగ్రత్తగా నడపాలని, ప్రజలు, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బైరామల్‌గూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బుర్రం ప్రకాష్, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కాలె యాదయ్య పర్యటన



**మొయినాబాద్, అక్టోబర్ 06, జనంసాక్షి:** మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పర్యటించనున్నట్లు కేతిరెడ్డిపల్లి సర్పంచ్ సర్పంచ్లు గోడుగు యాదయ్య, వెంకటాపూర్ సర్పంచ్ అర్చనఅజయ్యి, పంచాయతీరాజ్ డిప్యూటీ డిఈ విజయ్కుమార్రెడ్డిలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మొదటగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో పది లక్షల నిధులతో మహిళా సమైఖ్య నిర్మాణానికి శంకుస్థాపన, ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులకు పనులు ప్రారంభం చేయనున్నట్లు వివరించారు. అనంతరం వెంకటాపూర్ గ్రామంలో పూర్తి చేసిన 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం, అండర్ గ్రౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన, 25 లక్షల నిధులతో సీసీ రోడ్డు లైట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కార్యక్రమానికి విచ్చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ కళాశాలకు మరిన్ని గదుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించండి

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 6( జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ని మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలేజీలో మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉన్నారు సరిపడా సౌకర్యాలు వసతులు ఉన్నాయని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ కలెక్టర్కు వివరణ తెలుపుతూ అదనపు తరగతి గదులు అవసరమని కాలేజీలో ఉదయం ఇంటర్ మధ్యాహ్నం నుంచి డిగ్రీ కాలేజీని నిర్వహిస్తున్నామని వివరించారు. కాలేజీలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు కాలేజీ మొత్తం ఎంత స్థలంలో ఉందని కలెక్టర్ అడగగా మొత్తం మూడు ఎకరాలలో కాలేజీ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. అవసరమైన టాయిలెట్లు ల్యాబ్లు సరిపడా ఉన్నాయా అని కలెక్టర్ ప్రశ్నించగా ప్రిన్సిపల్ వివరిస్తూ అన్ని సరిపడా ఉన్నాయి కానీ అదనంగా ఏడు తరగతి గదులు అవసరమని వాటిని పై అంతస్తులో నిర్మించాలని కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఎగ్జిక్యూటివ్



ఇంజనీర్లను పంపుతానని వారు పరిశీలించి అంచనాలు ఇస్తారని, ఆ ప్రతిపాదనలు తనకు పంపమని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ నాగేంద్ర కుత్బుల్లాపూర్ మండల తహసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి , కాలేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ సిటిజన్స్ సేవలు, అనుభవం అమూల్యం

## ఘనంగా రాఘవేంద్ర కాలనీ సీనియర్ సిటిజన్స్ 10వ వార్షికోత్సవం

**హయత్‌నగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** హైకోర్టు కాలనీ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై సీనియర్ సిటిజన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం, మార్గదర్శకత్వం ఎంతో విలువైనవని అన్నారు. వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అసోసియేషన్ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద ఆందోళనలో పాల్గొన్న రమేష్ గుప్తా



**కీసర, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద మంగళారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పక్షాలు చేసిన ధర్నా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తో కలిసి పాల్గొన్న కిసర మండలం సీనియర్ నాయకులు రమేష్ గుప్తా, చిత్రంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమిటి రవి తదితరులు.

# 14 ఏళ్ల బాలిక అదృశ్యం



**చేవెళ్ల, అక్టోబర్ 06 (జనంసాక్షి)** చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మసాగర్ గ్రామంలో 14 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధర్మసాగర్‌లో అద్దెకు ఉంటున్న షాజహాన్ ఖాతూన్ కుటుంబం సోమవారం సాయంత్రం శంకర్‌పల్లికి సామాన్లు తరలించింది. అయితే కొన్ని సామాన్లు ధర్మసాగర్‌లోని అద్దె షట్టర్‌లోనే ఉండిపోవడంతో వాటిని చూసుకునేందుకు తన భర్త సోదరి సబ్రా ఖాతూన్ (14)ను అక్కడే ఉంచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సుమారు 9 గంటలకు షాజహాన్ ఖాతూన్ ధర్మసాగర్‌కు తిరిగి వచ్చేసరికి సబ్రా ఖాతూన్ షట్టర్‌లో కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద విచారించినప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. బాలిక గతంలో ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుండేదని ఫిర్యాదుదారు పోలీసులకు తెలిపారు. అదృశ్యమైన బాలిక సబ్రా ఖాతూన్, వయస్సు 14 సంవత్సరాలు, ఎత్తు సుమారు 4.2 అడుగులు, గోధుమ రంగు ఛాయ కలిగి ఉండి, హిందీ మాట్లాడగలదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. బాలికకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. రెక్కీ చేసి వరుస చోరీలు

## ఉద్యోగం కోల్పోయి ఆన్‌లైన్ పెట్టుబడుల్లో నష్టాలు.. దొంగతనాలకు అలవాటు పడిన నిందితుడి అరెస్ట్

## నార్కట్‌పల్లి, చిట్యాల, నల్లగొండ రూరల్, కట్టంగూర్, తిప్పర్తి పరిధిలో 9 చోరీలు.. బంగారం స్వాధీనం



**ఘట్‌కేసర్ (పోచారం), అక్టోబర్ 6 (జనంసాక్షి) :** తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహిస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి భారీగా బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అలుగుబెల్లి రాము ఏ జయరాం రెడ్డి (29), తండ్రి వెంకటరెడ్డి, ప్రకాష్‌నగర్ కాలనీ, ఆర్జికే, అన్నోజీగూడ, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నివాసం ఉంటున్నాడు. ఇతని స్థిర నివాసం నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం. గతంలో డెక్సన్ కంపెనీలో లీడ్ కన్సల్టెంట్‌గా పనిచేసిన రాము.. ఆన్‌లైన్ పెట్టుబడుల్లో నష్టపోవడంతో పాటు ఉద్యోగం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో దొంగతనాలకు పాల్పడటం ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

**తొమ్మిది ఇళ్లలో చోరీలు.. :** 2026 ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు, చిట్యాల పరిధిలో ఒకటి, నల్లగొండ రూరల్ పరిధిలో ఒకటి, కట్టంగూర్ పరిధిలో ఒకటి, తిప్పర్తి పరిధిలో ఒకటి చొప్పున మొత్తం తొమ్మిది తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆగస్టు 23 తెల్లవారుజామున అన్నోజీగూడలోని ప్రకాష్‌నగర్ కాలనీలో తన నివాసం పక్కనే తాళం వేసి ఉన్న ఇంటిని నిందితుడు లక్ష్యంగా చేసుకున్నాడు. ఇంట్లోకి ప్రవేశించి నెక్లెస్ చైన్, బ్రాస్లెట్, రెండు జతల చెవి దుద్దులు, ఉంగరం, ఒక మలబార్ బంగారు బిస్కెట్, ఆరు బిస్కెట్ కటింగ్ ముక్కలు, మొత్తం సుమారు 14 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.2 వేల నగదును అపహరించాడు.

**బంగారం విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు**

అక్టోబర్ 5న జోడిమెట్ల ఎక్స్ రోడ్డు సమీపంలో బంగారు బిస్కెట్లను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోచారం ఐటీ కారిడార్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బరువున్న ఒక మలబార్ బంగారు బిస్కెట్, మొత్తం 60 గ్రాముల బరువున్న ఆరు బంగారు బిస్కెట్ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారు ఆభరణాలను నిందితుడి నివాసం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని మంగళవారం సాయంత్రం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

# పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

## రూ.110 కోట్లతో చేపడుతున్న పనులను ఏడాదిలోగా పూర్తి

## రూ.18 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి

## రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను దశలవారీగా మెరుగుపరుస్తాం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు ఆక్టోబర్ 6(జనంసాక్షి) :** పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. తాండూర్ పట్టణానికి కాగ్నా నది నుంచి తాగునీటిని అందించేందుకు రూ.110 కోట్లతో చేపడుతున్న పనులను ఏడాదిలోగా పూర్తి చేసి ప్రజలకు నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సుమారు 30–35 ఏళ్ల నాటి పైప్‌లైన్ల కారణంగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తాండూర్ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.18 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.25.8 కోట్లతో పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను దశలవారీగా మెరుగుపరుస్తామని చెప్పారు. పట్టణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తాండూర్‌లో నూతనంగా ఆరు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. మాతా శిశు ఆసుపత్రిలో ఆధునిక సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు టెండర్లు పూర్తయ్యాయని, ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఇప్పటివరకు తాండూర్ పట్టణంలోని 12 వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల పక్కన ఉన్న డ్రైనేజీలు, కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భాగస్వామ్యంతో తాండూర్‌ను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో మున్సిపల్ పరిధిలో దశలో వారిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డులలో గల సమస్యల పరిష్కారాన్ని తెలుసుకునేందుకు మరియు కొన్ని సమస్యల సత్వర పరిష్కారం కోసమే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టినట్లు తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు తాండూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నవరాత్రులు.. జర్నలిస్టుల సహకారం అభినందనీయం

## మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి

## ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు

## 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**రంగారెడ్డి, అక్టోబరు 6 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవడంలో జర్నలిస్టులు అందించిన సహకారం అభినందనీయమని మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం ఆవరణలో పోలీసులు, మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు పండుగల సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ వార్తల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. బోనాలు, గణేష్ నవరాత్రుల సందర్భంగా వేలాదిగా ప్రజలు తరలివచ్చినప్పటికీ, పోలీసుల సమర్థవంతమైన సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా జర్నలిస్టులు వ్యవహరించడం వల్లే భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయగలిగామని తెలిపారు.

**నేరాల నియంత్రణకు112 సేవలు.. :** అత్యవసర సేవలందించే ‘112’ నంబర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నేరాల నియంత్రణకు మరింత బలం చేకూరిందని డీసీపీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రజలు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే 112 కు సమాచారం అందించాలని సూచించారు. రహదారి భద్రతపై వాహనదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీపీ హితవు పలికారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను జోడించాలని డీసీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కేపీవీ రాజు, ఫ్యూచర్ సిటీ సీఐ మహేందర్ రెడ్డితో పాటు మంచాల, యాచారం, మాడ్గుల సీఐలు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సిబ్బందికి ఆత్మీయ సత్కారం




### అంగన్వాడీ, ఆశ కార్యకర్తల సేవలకు గుర్తింపు

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి

**కీసర, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** ప్రజారోగ్యం, మహిళా, శిశు సంక్షేమంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తల సేవలు వారి పాత్ర కీలకమని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మంగళవారం కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో చీర్యాల గ్రామంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, పార్టీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తల సేవలను గుర్తించి వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి జగన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాసరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, ప్రగతి, లిఖిత, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏలూరి సత్యనారాయణ, కన్వీనర్ ఉమారెడ్డి, శాలిని, డివిజన్ నాయకులు నాగరాజు, కోల మహేందర్, కోల మల్లేష్, పొట్ట ఆంజనేయులు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కీసర మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.





# సనత్‌నగర్ నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు

**అమీర్‌పేట్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను సనత్‌నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. అమీర్‌పేట్‌లోని సత్యం థియేటర్ సర్కిల్‌లో మాజీ కార్పొరేటర్ నామ శేషుకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ హాజరై కేక్ కట్ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులు తలసాని శ్రీనివాస్ యాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మోండా మార్కెట్‌లోనూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తలసాని సాయి కిరణ్ యాదవ్ హాజరయ్యారు. మార్కెట్‌లోని చిరు వ్యాపారులు తలసాని శ్రీనివాస్ యాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



# మహిళలు, బాలల భద్రతపై అప్రమత్తతే రక్షణ

### ఉమెన్, చైల్డ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం

**దోమ అక్టోబర్ 06 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమంలో భాగంగా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలను ఉద్దేశించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు మరియు బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలికలకు గుడ్ టచ్ -- బాడ్ టచ్ మధ్య తేడాను చిన్న వయస్సు నుంచే తెలియజేయాలని, అనుమానాస్పదమైన లేదా అసౌకర్యంగా అనిపించే ప్రవర్తనను వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని చెప్పారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు మరియు బాలికలను వేధించడం, ఈవ్‌టీజింగ్ చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లు, బ్యాంకింగ్ వివరాలు, లొకేషన్ వంటి సున్నితమైన సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రతి ఒక్కరూ "సైబర్ హైజీన్" పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరికీ అనేక అవకాశాలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. మహిళలు, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలలపై ఏదైనా వేధింపులు, బాల కార్మికత్వం, బాల్య వివాహం లేదా ఇతర సమస్యలు గుర్తించినప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలకు మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# ఎస్ఐఆర్‌పై ఇండియా కూటమి నేతల ఆందోళన

### జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి : వజ్రేష్ యాదవ్

### ఓటర్ల హక్కుల పరిరక్షణకు పోరాటం

### ఎస్ఐఆర్ రద్దు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి పక్షాలు డిమాండ్ చేశాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులను హరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, టీజేఎస్ నాయకులు మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్**

ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని, ప్రతి అవకతవకను వెలుగులోకి తీసుకొచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.



**ఎస్ఐఆర్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం : మేడ్చల్ జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి పి.సత్యం**

ఓటర్ల జాబితాల నుంచి పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు రాజ్యాంగ విరుద్ధమని, ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు.

**రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాలి : వి.ఎస్. బోస్, ఉమామహేష్**



ప్రజల ఓటు హక్కులకు భంగం కలిగించే చర్యలను నిలిపివేయాలని, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సీపీఐ నాయకులు కోరారు. ధర్నాలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్, సీపీఎం నాయకులు కోమటి రవి, ఎర్ర అశోక్, రాజశేఖర్, సబిత, నరేష్, గణేష్, చింతల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, నక్క సందీప్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్ టి ఏ సభ్యులు భీమిలి జైపాల్ రెడ్డి, ముప్పా రామారావు, రమేష్ గుప్తా, యాదగిరి గౌడ్, ఈగ రాజు ముదిరాజు, కాంగ్రెస్ పార్టీ, వామపక్షాల పార్టీల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి భూమిపై దళారుల దందా!

**వికారాబాద్ జిల్లా యాలాల మండలం అగ్గనూరు గ్రామ పరిధిలోని శ్రీ మహాలింగేశ్వర దేవాలయానికి చెందిన భూమిపై వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. సర్వే నంబర్ 72లోని సుమారు 18 ఎకరాల 7 గుంటల దేవాదాయ శాఖ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా భూమిగా మార్చేందుకు పైస్థాయి రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం నిషేధిత జాబితా అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో ఈ భూమిపై మళ్లీ చర్చలు మొదలయ్యాయి.**



## ఎండోమెంట్ భూమికి పట్టా కోసం ముఖ్యమంత్రి స్థాయిలో పైరవీలు?

- అగ్గనూరులో 18.7 ఎకరాల భూమిపై ఆరోపణలు
- నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలంటూ ప్రచారం
- రూ.35 లక్షల అడ్వాన్స్ ఇచ్చి భూమి దక్కలేదంటున్న రిటైర్డ్ ఎస్సై
- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుడి విజ్ఞప్తి





**యాలాల అక్టోబర్ 6 (జనంసాక్షి) :**
భూమి దేవాదాయ శాఖకు సంబంధించినదని తెలిసినప్పటికి, దానిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కొందరు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయి వరకు పరిచయాలు ఉన్నాయని, ఆ స్థాయిలో పైరవీలు చేసి రిజిస్ట్రేషన్ చేయించు కుంటామని కొందరు దబాయిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. భూమి యజమాని తరఫున అధికారం పొందిన జీపీఏ హోల్డర్ ద్వారా 2016 నుంచే భూమి అమ్మకం విషయంలో కొనుగోలుదారులతో వ్యవహారాలు సాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూమి దేవాదాయ శాఖకు సంబంధించినదే నని కొనుగోలుదారులకు ముందుగానే చెబుతూ, అయినప్పటికి కొనుగోలు చేస్తే భవిష్యత్తులో పట్టా మార్పిడి చేసుకోవచ్చనే భరోసాతో అడ్వాన్స్‌లు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టా మార్పిడి, రిజిస్ట్రేషన్ జరుగుతుందని నమ్మి డబ్బులు చెల్లించిన పలువురు కొనుగోలుదారులు చివరకు డబ్బులు కోల్పోయి వెనుదిరిగినట్లు తెలుస్తోంది.
ఇదే క్రమంలో 2018లో తాండూరు ప్రాంతంలోని సాయిపూర్‌కు చెందిన రిటైర్డ్ ఎస్సై నర్సింలు సైతం తన పదవీ విరమణ అనంతరం వచ్చిన సుమారు రూ.35 లక్షల మొత్తంతో ఈ భూమిని కొనుగోలు చేసేందుకు జీపీఏ హోల్డర్ ద్వారా ఒప్పందం చేసుకున్నట్లు చెబుతున్నారు. అనంతరం అదే భూమికి మరో వ్యక్తి ఎక్కువ ధర చెల్లించేందుకు ముందుకు రావడంతో తనకు ఇచ్చిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా వ్యవహరించారని నర్సింలు ఆరోపిస్తున్నారు.తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు 'మీ దగ్గర ఏ ఆధారాలు ఉన్నాయి?' అంటూ ప్రశ్నిస్తూ, రాజకీయ పలుకుబడి ఉందన్న ధీమాతో బెదిరింపు ధోరణిలో వ్యవహరించారని ఆయన వాపోతున్నారు. 2018 నుంచి తన డబ్బు రికవరి కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని చెబుతున్నారు. అప్పట్లో ఈ భూమిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 2019 అక్టోబర్ 17న అప్పటి దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సంధ్యారాణి భూమిని సందర్శించి, అక్రమ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ సంవత్సరాలు గడిచినా భూమి చుట్టూ కొనుగోళ్లు, అడ్వాన్స్‌లు, పట్టా ప్రయత్నాల ఆరోపణలు కొనసాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. ఈ వ్యవహారంలో పలువురు రాజకీయ నాయకుల పేర్లు వినిపిస్తున్నా యని, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకుల పేరు చెప్పుకుంటూ మధ్యవర్తిత్వం, పైరవీలు సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కమిషన్ల కక్కుర్తితో కొందరు రాజకీయ మధ్యవర్తులు దేవాదాయ శాఖ భూమి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు మరింత తీవ్ర చర్చకు దారితీస్తున్నా యి. ఈ భూమిని రక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉండగా, నిషేధిత జాబితాలో ఉన్న భూమిపై కొనుగోళ్లు, అడ్వాన్స్‌లు, పట్టా ప్రయత్నాల ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూమిపై ఎవరైనా అక్రమంగా హక్కులు కల్పించుకునే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం, మరియు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### "అడ్వాన్స్ ఇచ్చాను.. భూమి రాలేదు.. డబ్బులూ ఇవ్వడం లేదు"

**రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదంటున్న రిటైర్డ్ ఎస్సై నర్సింలు :**



2018లో శ్రీ మహాలింగేశ్వర దేవాలయ భూమిని కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో జీపీఏ హోల్డర్ ద్వారా సుమారు రూ.35 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించానని రిటైర్డ్ ఎస్సై నర్సింలు తెలిపారు. భూమి విషయంలో అప్పట్లోనే పలు అనుమానాలు ఉన్నప్పటికీ, తనకు భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పడంతో డబ్బులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. తర్వాత అదే భూమికి మరొకరు ఎక్కువ ధరకు ముందుకు రావడంతో తనతో చేసుకున్న ఒప్పందాన్ని పక్కనపెట్టి, తాను ఇచ్చిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా వ్యవహరించారని నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. "భూమి ఇవ్వకపోయినా పర్వాలేదు.. కనీసం నేను ఇచ్చిన డబ్బులైనా తిరిగి ఇవ్వాలి. కానీ సంవత్సరాలు గడుస్తున్నా నా డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు" అని ఆయన వాపోయారు.
డబ్బులు అడగడానికి వెళ్లిన సమయంలో "నీవు ఏం చేసుకుంటావో చేసుకో" అనే ధోరణిలో మాట్లాడారని, తన సమస్య పరిష్కారం కోసం పలువురు రాజకీయ నాయకులను ఆశ్రయించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆయన తెలిపారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారనే అనుమానం వ్యక్తం చేశారు.
"నేను ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నాను. నా జీవితకాల సంపాదనలోని డబ్బును భూమి కొనుగోలు కోసం ఇచ్చాను. భూమి ఇవ్వలేదు.. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. అడిగితే ఆధారాలు ఏమున్నాయని ప్రశ్నిస్తూ నన్నే ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అని నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు.
ఇలాంటి పరిస్థితుల్లో గతంలో ఈ భూమిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్‌లు ఇచ్చిన మరికొందరు కూడా తమ డబ్బులు తిరిగి రాకపోవడంతో వెనుదిరి గారని ఆయన తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ జరుగుతుందన్న నమ్మకంతో అడ్వాన్స్‌లు చెల్లించినవారికి చివరకు భూమీ దక్కక, డబ్బులూ చేతికందకపోవడం ఈ వ్యవహారంలో అత్యంత బాధాకరమైన అంశమని ఆయన పేర్కొన్నారు.
"ఈ విషయంపై ముఖ్యమంత్రి మా ప్రాంత వాసులైనందున చొరవ తీసుకుని సమగ్ర విచారణ చేయించి మాకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం. దేవాలయ భూమి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మా లాంటి వారికి న్యాయం జరగాలి" అని నర్సింలు కోరారు. మాకు న్యాయం జరగని పక్షంలో మరణమే శరణ్యము అని భార్యా భర్తలు " జనం సాక్షి దినపత్రిక " సమక్షంలో వాపోయారు.

# శేరిలింగంపల్లిలో అక్రమ వ్యభిచారానికి నయా భాష్యం




హైదరాబాద్ - రంగారెడ్డి - మేడ్చల్ మల్కాజిగిరి - వికారాబాద్
2 ఆదివారం 27 సెప్టెంబర్ 2026
పుట్టగొడుగుల్లా అక్రమ హోటల్స్
యదేచ్ఛగా మైనర్ అమ్మాయిల బస
జనంసాక్షి

- ప్రైవేట్ లాడ్జిలే అసాంఘిక అడ్డాలుగా మారుతున్న వైనం!
- మైనర్ అమ్మాయిలే లక్ష్యంగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హోటల్స్
- సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సాక్షిగా కొరవడుతున్న నిఘా వైఫల్యం!?

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రైవేట్ హోటళ్లు, లాడ్జిల సంఖ్య గణనీయంగా పెరుగుతుం డటంతో వాటి నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చందానగర్, గంగా రం, మదీనాగూడ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట పెద్ద సంఖ్యలో హోటళ్లు, లాడ్జిలు ఏర్పాటవుతున్నాయని, వీటిలో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మైనర్లను లక్ష్యంగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణ లపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.
హోటల్, లాడ్జి నిర్వహణకు పోలీస్ అనుమతులు, భవన సంబంధిత పత్రాలు, అగ్నిమాపక భద్రత, మున్సిపల్ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, ఆరోగ్యశాఖకు సంబంధించిన అనుమతులు తదితర నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రైవేట్ లాడ్జిలు ఈ నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నాయా? అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గదుల బుకింగ్, అతిథుల వివరాల నమోదు, చెక్‌ఔట్ వంటి అంశాల్లోనూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.
ఇటీవల పరిసర ప్రాంతాల్లోని కొన్ని హోటళ్లలో చోటుచేసుకున్న నేర ఘటనలు కూడా లాడ్జిల భద్రతా ప్రమాణాలపై చర్చకు దారితీశాయి. హోటళ్లలోకి వచ్చే అతిథుల గుర్తింపు, వయసు నిర్ధారణ, రిజిస్టర్‌ల నిర్వహణ, సీసీ కెమెరాల పని తీరు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మైనర్లు హోటళ్లలోకి ప్రవేశించకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు. హోటళ్లు, లాడ్జిలపై పోలీసులు, మున్సిపల్, అగ్నిమాపక, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, మైనర్ల భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. భారీ ఘటనలు చోటుచేసుకున్న తర్వాత స్పందించడం కంటే ముందుగానే ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ పెంచితే అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.